క్లుప్తంగా

మట్టి వినాయకునికి పూజలు



ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను అందజేస్తున్న ప్రభుత్వ డ్రైవర్ల సంఘం నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా కార్యాలయంలో మట్టి వినాయకుడుని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పన్నీర్ సెల్వం సంఘ సభ్యులకు ఉచితంగా మట్టి వినాయకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షులు నాగరాజులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేశ్‌బాబు, కోశాధికారి బాలాజి, సభ్యులు దేవా, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

11న బుచ్చిరెడ్డికండ్రిగ చెరువు వేలం

వెదురుకుప్పం: మండలంలోని ఆళ్లమడుగు పంచాయతీ బుచ్చిరెడ్డికండ్రిగ చెరువులో 2024–25 సంవత్సరానికి చేపల పెంపకం కోసం ఈ నెల 11వ తేదీన వేలం వేయనున్నట్లు డీడీఓ మోహన్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆళ్లమడుగు గ్రామంలోని రచ్చబండ వద్ద 11వ తేదీ ఉదయం 11 గంటలకు వేలం పాటను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనే ఆసక్తి ఉన్న వారు రూ.17,500 డిపాజిట్ చెల్లించి, పాడుకోవాలని కోరారు.

మహాభారత యజ్ఞం ప్రారంభం

తవణంపల్లె: స్థానిక ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడిలో ఆదివారం మహాభారత యజ్ఞంకు శ్రీకారం చుట్టారు. ఆలయంలో ద్రౌపదీ సమేత ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకుల సహదేవుల విగ్రహాలకు అర్చకులు శాస్త్రోక్తంగా అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. అనంతరం ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ నెల 30వ తేదీ వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ప్రతి రోజూ భాగవతారిణి స్వర్ణలత హరికథాగానానం చేస్తారని ఆలయ ధర్మకర్త మునస్వామి శెట్టి, కార్యనిర్వాహకులు తెలిపారు.

గర్భగుడి జీర్ణోద్ధరణ పనులకు భూమి పూజ

తవణంపల్లె: స్థానిక పురాతన శ్రీ కోదండరామ స్వామి దేవస్థానం గర్భగుడి జీర్ణోద్ధరణ పనులకు గ్రామస్తులు ఆదివారం శాస్త్రోక్తంగా భూమి పూజ చేశారు. గర్భగుడి శిథిలావస్థకు చేరుకోవడంతో నూతనంగా నిర్మించి జీర్ణోధారణ పనులు చేయించాలని తిరుమల–తిరుపతి దేవస్థానానికి ప్రతిపాదనలు పంపారు. దీనిని టీటీడీ పరిశీలించింది. గ్రామస్తులు 10 శాతం వాటా టీటీడీ నిధులు 90 శాతం చొప్పున రూ. కోటి మంజూరు చేసింది. ఈ క్రమంలో ఆగమశాస్త్రం ప్రకారం టీటీడీ ఆధ్వర్యంలో గర్భగుడి జీర్ణోద్ధరణ పనులు ప్రారంభించారు.

ఎస్పీ చవితి పూజలు



చిత్తూరు అర్బన్: చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు శనివారం తన క్యాంపు కార్యాలయంలో వినాయకున్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. గణపతికి నైవేద్యాన్ని సమర్పించి.. విశ్వాసం, భక్తికి పండుగలు అవసరమన్నారు. ఎస్పీతో పాటు క్యాంపు కార్యాలయ అధికారులు, సిబ్బంది పూజల్లో పాల్గొన్నారు.

గణేష్ మహరాజ్‌కి జై...



కొత్తపేటలోని కొలనుకట్టు వీధిలో ఏర్పాటుచేసిన వినాయక ప్రతిమ వద్ద భక్తులు



కార్వేటినగరంలో ఊరేగుతున్న భారీ వినాయక విగ్రహాలు

- వైభవంగా వినాయక చవితి వేడుకలు
- భారీ ప్రతిమలు ఏర్పాటుచేసి పూజలు
- ఆకట్టుకున్న వినాయక విగ్రహాలు

నగరి: నియోజకవర్గ పరిధిలో వినాయక చవితి వేడుకలు శనివారం వైభవంగా సాగాయి. ఉదయం నుంచి పట్టణంలో పండుగ సందడి కనిపించింది. పలువురు మట్టితో చేసిన వినాయకుని ప్రతిమలను ఇళ్లకు తీసుకెళ్లారు. ప్రధాన రహదారి మొత్తం పూజా సామగ్రి విక్రయాలు, కొనుగోలుదారులతో ప్రధాన రహదారి కిక్కిరిసింది. నగరి మున్సిపల్ పరిధిలోని చావిడి ప్రాంతం, బస్టాండు ప్రాంగణం, ఓంశక్తి ఆలయ సమీపం, బైపాస్ రోడ్డు వద్ద, పద్మావతి నగర్, కొత్తపేట, సత్రవాడ, ఏకాంబరకుప్పం, కేవీపీ ఆర్ పేట, బస్టాండు ప్రాంగణం అతి పెద్ద వినాయకుని ప్రతిమలు ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేపట్టారు. మండల పరిధిలో గ్రామగ్రామాన భారీ వినాయక ప్రతిమలు వెలశాయి. విగ్రహాలు ఏర్పాటుచేసిన ప్రాంతంలో భక్తులకు గుగ్గిళ్లు, చక్కెర పొంగలి, పులిహోర, మిరియాల పొంగలి, స్వీట్లు ప్రసాదంగా పంచారు. మున్సిపల్ పరిధిలోని ఓంశక్తి ఆలయం సమీపంలో కొబ్బరికాయలతో ఏర్పాటుచేసిన వినాయక ప్రతిమ భక్తులను విశేషంగా ఆకర్షించింది. విఘ్నేశ్వరాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆలయాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

వినాయకుని వద్ద ఎలుక సందడి

కొండచుట్టు మండపంలోని వినాయకుని వద్ద ఉంచిన ప్రసాదాల్లోని మొక్కజొన్నను విఘ్నేశ్వరునిపై నుంచి దిగిన ఎలుక తినడం భక్తులకు ఆశ్చర్యాన్ని కలిగించింది. ఈ వింతను చూడడానికి జనం ఆలయం వద్దకు పరుగులు తీశారు.



పుత్తూరు: మూషిక వాహనంపై ఊరేగుతున్న వినాయకస్వామి, శ్రీరామపురంలో వినాయక విగ్రహం, మండపంలోని వినాయకునిపై నుంచి వచ్చి మొక్కజొన్న తింటున్న ఎలుక

వేడుకగా వినాయక చవితి

పుత్తూరు: పట్టణంలో వినాయక చవితి వేడుకలను శనివారం ప్రజలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలు కాలనీలు, వీధుల్లో చలువ పందిళ్లు వేసి, భారీ విగ్రహాలను ఏర్పాటు చేసి, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ వినాయకుడ్ని పూజిచడం ద్వారా మంచి బుద్ధిని పొందవచ్చునని, తద్వారా ప్రతి పనిలో విజయం సాధించవచ్చునని తెలిపారు. బజారువీధిలోని వినాయకస్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తి వినాయకస్వామిని పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి మూషిక వాహనంపై కొలువు దీర్చారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, బాణసంచా నడుమ పట్టణ పురవీధుల్లో జై భోలో గణేష్‌కీ జై అంటూ నినాదాలు చేస్తూ ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే బెస్తవీధి తరుణ గణపతి, జెండామాను వీధిలోని సెల్వగణపతి ఆలయాల్లోనూ ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.

నింద్రలో..

నింద్ర: వినాయక చవితి పర్వదినాన్ని శనివారం మండలంలోని ప్రజలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన నింద్రలో శనివారం గ్రామంలోని ప్రసన్న వినాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామివారిని గ్రామంలో ఊరేగించారు. అదే విధంగా పలు వీధుల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని శ్రీరామపురం గ్రామంలో పెద్ద వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. యువకులు వినాయక చవతి సంబరాలు వేడుకగా నిర్వహించారు.

విజయపురంలో..

విజయపురం: మండలంలో వినాయక చవితి వేడుకలు శనివారం వాడవాడలా ప్రజలు ఘనంగా నిర్వహించారు. ప్రతి గ్రామాల్లో 10 నుంచి 20 అడుగుల వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. వీధుల్లో పందిరి ఏర్పాటు చేసి, వాటిని విద్యుత్ దీపాలతో అలంకరించి షెడ్యూల్ ప్రకారంగా వేద పండితులు ఆయా గ్రామాల్లో గణనాథులను వేద మంత్రోచ్ఛారణ మధ్య ప్రతిష్ఠించారు. అనంతరం చిన్నారుల, పెద్దల సైతం స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ప్రసాదం అందించారు.

వాడవాడలా గణనాథుని ఉత్సవాలు

కార్వేటినగరం: మండలంలో వాడవాడలా గణనాథుని ఉత్సవ వేడుకలను శనివారం వైభవోపేతంగా నిర్వహించారు. కార్వేటినగరం గాండ్లమిట్ట కూడలిలో వినాయక యువత ఆధ్వర్యంలో భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే శివాలయం వీధిలో సుమారు రూ.1.80 లక్షల విలువ జేసే భారీ వినాయక విగ్రహాన్ని క్రేన్ సహాయంతో ఏర్పాటు చేశారు. స్థానిక భక్తులు భారీ విగ్రహానికి గజమాలలు వేసి ఉండ్రాళ్లతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అదే విధంగా చిన్ననగర్ వీధిలో ఏర్పాటు చేసిన భారీ మట్టి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేపట్టి హారతులు పట్టారు. తూర్పు వీధి, బంగారమ్మ వీధి, కార్వేటినగరం పెద్ద దళితవాడ, పాదిరికుప్ప, కొల్లాగుంట, డీఎం పురం, కేఎం పురం, ఎర్రమరాజుపల్లి, గాజంకి, టీకేఎం పేట, సీడీ కండ్రిగ, కత్తెరపల్లి గ్రామాల్లో పెద్ద ఎత్తున వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి ఊరేగింపు నిర్వహించారు. గాండ్లమిట్ట కూడలి, చిన్ననగర్ వీధుల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, స్థానిక సర్పంచ్ ధనుంజయవర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు.



విజయపురం : వినాయకుడిని మొక్కుతున్న చిన్నారులు



పూజల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకుడు హరికృష్ణ

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండల వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగాయి. ప్రధానంగా పచ్చికాపల్లం, వెదురుకుప్పం, పాతగుంట, నల్లవెంగనపల్లె, దేవళంపేట, మొరవ, దాసరి కాలనీ, బొమ్మన్‌దొడ్ల గ్రామాలతోపాటు పలు గ్రామాల్లో గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. యువత గ్రామాల్లో మండపాలు ఏర్పాటు చేసుకుని భారీ విగ్రహాలు కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాసరి కాలనీలో జరిగిన గణేష్ ఉత్సవాలకు వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి కుతూహలమ్మ తనయుడు హరికృష్ణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు చంద్రారెడ్డి, భీమశంకర్‌రెడ్డి, రోశిరెడ్డి, చెంగ్రాయులు ఉన్నారు.



కొండచుట్టు మండపం వద్ద ఏర్పాటుచేసిన వినాయక ప్రతిమను దర్శించుకుంటున్న జనం, చావిడి వద్ద ఏర్పాటుచేసిన భారీ వినాయక విగ్రహం, బస్టాండు ప్రాంగణంలో ఏర్పాటుచేసిన వినాయక ప్రతిమ వద్ద ప్రసాదాల పంపిణీ, నగరిలో జనంతో కిక్కిరిసిన ప్రధాన రహదారి

నగరిలో జాతర సందడి



గెరిగ ఉత్సవం ప్రారంభిస్తున్న జాతర నిర్వాహకులు



దేశమ్మ ఆలయం వద్ద పొంగళ్లు పెడుతున్న మహిళలు

- వైభవంగా గెరిగ ఊరేగింపు
- గ్రామదేవత ఆలయాల వద్ద జాతర పొంగళ్లు

నగరి: పట్టణంలో గంగ జాతర సందడి ఆదివారం మొదలైంది. జాతర సాంప్రదాయ ఆచార వ్యవహారాల్లో భాగంగా గంగమ్మ తల్లికి ప్రీతికరమైన గెరిగ ఉత్సవాన్ని తలారి వీధి గంగమ్మ గుడి వద్ద నిర్వాహకులు ప్రారంభించారు. జాతర హద్దుల్లో ఉన్న ఇళ్లకు ఊరేగింపుగా వెళ్లిన గెరిగకు పసుపుకుంకుమల నీటితో హారతులు తీశారు. దర్శించుకున్న మహిళలు నైవేద్యం సమర్పించి భండారం స్వీకరించారు. గెరిగ ప్రారంభోత్సవంలో జాతర నిర్వాహకులు నరసింహారెడ్డి, జ్యోతిరెడ్డి, సురేష్ నాయుడు, ధయానిధి, చిరంజీవిరెడ్డి, ఇంద్రయ్య, టీకే మదన శ్రీనివాసన్, మణిగండ, శ్రీను, బాలాజీ, జనార్దన్, ప్రసాద్, సేడ్, రాజేష్, అశోక్, సునీల్, రవి, కుమార్, మహేష్, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

దేశమ్మకు జాతర పొంగళ్లు

నేత్రదేవత దేశమ్మ ఆలయంలో మహిళలు ఆదివారం జాతర పొంగళ్లు పెట్టారు. దీంతో ఆలయ ఆవరణ పొంగళ్లు పెట్టేవారితో నిండిపోయింది. అధిక సంఖ్యలో పొంగళ్ల కోసం పొయ్యిలు వెలిగించడంతో పొగలు, సెగలతో నిండిపోయింది. జాతర పొంగళ్లను అమ్మవారి పాదుకల వద్ద ఉంచి మహిళలు నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థాన్ని కళ్లలో చల్లుకున్నారు. ఈవో రామచంద్రయ్య, ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కొట్రకోన శివాలయంలో సరికొత్త ఫ్లోరింగ్



కొట్రకోన శివాలయంలో అభివృద్ధి పనులు

గంగాధరనెల్లూరు: మండలంలోని కొట్రకోన శివాలయంలో కొత్తగా ఫ్లోరింగ్, మౌల్డింగ్ పనులు చేపట్టారు. లక్ష్మీరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జానకి రామానాయుడు అల్లుడు మహేష్ కొట్రకోన శివాలయంలోని దర్బార్ మండపానికి రాతి మూత బండలపై మౌల్డింగ్ వేయించారు. అలాగే దర్బార్ మండపం చుట్టూ ఉన్న చతురస్ర మండపంలో ఫ్లోరింగ్ పనులు చేయించారు. ఐదు లక్షల రూపాయలు ఆలయ అభివృద్ధి పనులకు వెచ్చించారు. ఆలయ అభివృద్ధి పనులకు సహకరించిన మహేష్‌ను గ్రామస్తులు భక్తులు అభినందించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అతి తక్కువ రోజులలోనే ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తిచేయనున్నట్లు కమిటీ అధ్యక్షుడు రామ్మూర్తి నాయుడు, ప్రధాన కార్యదర్శి యుగంధరాచార్యులు తెలిపారు.

అధైర్య పడొద్దు.. ఆదుకుంటాం



మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

– మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: ఎవరూ అధైర్య పడొద్దని, అండగా ఉంటామని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి వ్యాఖ్యానించారు. ఆదివారం మండలంలోని గంటావారిపల్లె గ్రామంలో జరిగిన వినాయక ఉత్సవాలకు ఆయన హాజరయ్యారు. పూజలనంతరం కార్యకర్తలు, నాయకులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు ఆయనకు ఏకరవు పెట్టారు. దీంతో ఆయన స్పందిస్తూ ఎవ్వరికీ భయపడాల్సిన పని లేదు ఎలాంటి ఆందోళన వద్దు అని భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి ఏకతాటిపై నిలబడాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పార్టీలకు అతీతంగా పనులు చేసి పెట్టామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీలతో ప్రజలను మోసగించినా కక్షాపూరిత రాజకీయాలకు తెరతీసినట్లు గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం పాల్పడుతున్న అణచివేతను అంతా కలిసి ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. గడిచిన ఐదేళ్లలో గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఎలాంటి కక్షాపూరిత రాజకీయాలకు తావు లేకుండా అందరినీ సమానంగా చూసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నాగరాణి, ఎంపీటీసీ చిన్నబ్బ, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు రామయ్య, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి .బండి హేమసుందర్ రెడ్డి, బీసీ సెల్‌రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టీ సుబ్రమణ్యం, యువత మండల అధ్యక్షుడు గణపతిరెడ్డి, సర్పంచ్ గోవిందయ్య, నరేష్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మునికృష్ణా రెడ్డి, వెంకటేశ్, దళిత నాయకులు చెంగల్రాయులు, వెంకటేశ్, నాగరాజు, రాము, విజయ భాస్కర్, మురళీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

మురికి కూపంలో తిమ్మాపురం

- రోడ్లపైనే డ్రైనేజీ దుర్గంధం
- రోగాల బారిన పడుతున్న గ్రామస్తులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- ఆందోళనకు సిద్ధమవుతున్న గ్రామ ప్రజలు



తిమ్మాపురంలో అడుగు పెట్టాలంటే డ్రైనేజీలో దిగాల్సిందే.., డ్రైనేజీలోనే తాగునీటి కొళాయి



తిమ్మాపురంలో డెంగీ జ్వరంతో బాధపడుతున్న రాజేశ్వరమ్మ, టైఫాయిడ్‌తో బాధ పడుతున్న వేలమ్మ

పుత్తూరు: మున్సిపాలిటీ 2వ వార్డు కేంద్రమైన తిమ్మాపురం గ్రామంలో పారిశుధ్యం అత్యంత దారుణంగా తయారైంది. గ్రామస్తులు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర ప్రాణాంతక జ్వరాల బారిన పడుతున్నారు. రోడ్లపైనే డ్రైనేజీ పారుతోందని, దుర్గంధం వెదజల్లుతోందని, దోమలు ముసురుతున్నాయంటూ గ్రామస్తులు గగ్గోలు పెడుతున్నారు. గ్రామస్తులు గత కొన్ని నెలలుగా గ్రామంలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని మున్సిపాలిటీ అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. అయినా మున్సిపల్ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. గ్రామంలో ఇటీవల డ్రైనేజీ సమస్యపై గ్రామస్తులు రెండు వర్గాలుగా విడిపోయి ఘర్షణలకు సైతం దిగారు. ఆ సమయంలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన మున్సిపల్ అధికారులు నేటికీ ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. మున్సిపాలిటీ పరిధిలోనే నందిమంగళం గ్రామంలో ఇటీవలే అతిసారం సోకి పలువురు ఆసుపత్రుల పాలయ్యారు. ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఈ నేపథ్యంలో కురుస్తున్న వర్షాలు ఓ వైపు, డ్రైనేజీ సమస్యతో పలువురు తిమ్మాపురం గ్రామస్తులు రోగాల బారిన పడ్డారు. చావులు కళ్లారా చూస్తేగానీ స్పందించరా అంటూ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. తిమ్మాపురం గ్రామంలో డ్రైనేజీ సమస్యకు రెండు రోజుల్లో శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేనిపక్షంలో మున్సిపాలిటీని ముట్టడించడంతోపాటు తిరుపతి కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామంటూ హెచ్చరిస్తున్నారు.



ఇది డ్రైనేజీ కాదు... తిమ్మాపురం రోడ్డు, బైక్‌లోనైనా డ్రైనేజీలో దిగాల్సిందే, మడవ తిప్పినా తిప్పలు తప్పడం లేదు

వరసిద్ధునికి రూ.12లక్షల వాహనం సమర్పణ

- వాహనదాతలే కూరగాయలు సైతం అందజేత



కూరగాయలు తరలించే వాహనం అందజేస్తున్న శ్రీవారి సేవకులు

కాణిపాకం: పలమనేరుకు చెందిన శ్రీవారి సేవకులు రవీంద్రారెడ్డి, మోహన్‌రెడ్డి, జైల్ సింగ్ కలిసి కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి క్షేత్రంలోని నిత్య అన్నదానానికి కూరగాయలు అందజేసేందుకు (టాటాయోధ) రూ. 12 లక్షల వాహనం అందజేశారు. అలాగే 2.5 టన్నుల వివిధ రకాల కూరగాయలు ఇచ్చారు. అలాగే బంగారుపాళ్యం మండలం కొత్త వెంకటాపురం గ్రామానికి చెందిన దాత మోహన్‌నాయుడు నిత్యాన్నదానం ట్రస్టుకు రూ.1,11,116 విరాళాన్ని ఎమ్మెల్యే, ఈవోకు అందజేశారు.